సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



ఇంటి యజమానే దొంగ 8లో



మహాకవి ఆరుద్ర సాహిత్యం అజరామరం 8లో



సాగరతీరంలో 'విష్ణు విన్యాసాలు' 8లో

వేయి కళ్లతో ఎదురుచూపులు

- 15న డీఎస్సీ తుది ఎంపిక జాబితా?
- 19న అమరావతిలో నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు!

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ-2025కు ఎంపికైన అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. ఈ నెల 19న అమరావతిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేయడానికి విద్యాశాఖ అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అభ్యర్థులను ప్రత్యేకంగా అమరావతికి తీసుకువెళ్లేందుకు రవాణా ఏర్పాట్లు చేస్తున్నామని డీఈవో ఎన్.ప్రేమకుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 15న డీఎస్సీ తుది ఎంపిక జాబితా విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. అప్పటి నుంచి ఎంపికైన అభ్యర్థులకు ఆహ్వాన పత్రాలు, మెసేజ్‌లు అందుతాయన్నారు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఇక్కడి నుంచి అమరావతికి బయలుదేరడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రకటనతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే.. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో కొందరికి అర్ధరాత్రి వేళ సందేశాలు వచ్చిన అనుభవంతో.. ఈ సారి కూడా అలా ఆలస్యమైతే జిల్లా నలుమూలల నుంచి సకాలంలో అమరావతికి బయలుదేరగలమా అని ఆందోళన చెందుతున్నారు. గతంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లోనే కేంద్రంలోనే నియామక పత్రాలు ఇచ్చేవారని, అది ఎంతో సౌకర్యంగా ఉండేదని పలువురు గుర్తుచేసుకుంటున్నారు. కాగా.. డీఎస్సీ-2025 ప్రక్రియ ప్రారంభం నుంచి అభ్యర్థులు అనేక గందరగోళాలను, అడ్డంకులను ఎదుర్కొన్నారు. నోటిఫికేషన్ మొదలుకుని, ఫలితాల వెల్లడి, ధ్రువపత్రాల పరిశీలన వరకు పలు దశల్లో జాప్యం, వివాదాలు చోటుచేసుకున్నాయి. వివాహితల ధ్రువపత్రాలు, నకిలీ సదరం సర్టిఫికెట్లు వంటి సమస్యలను అధిగమించి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు, ఇప్పుడు తుది నియామకాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

డీసీపీ-1 అజిత బదిలీ

నంద్యాల ఎస్పీగా గ్రేహౌండ్స్ కమాండర్ సునీల్

విశాఖ సిటీ: విశాఖ డీసీపీ-1 అజిత వేజెండ్ల నెల్లూరు ఎస్పీగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 జూలై 20న విశాఖ డీసీపీ-1గా అజిత బాధ్యతలు చేపట్టారు. పలు కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్ అధికారులకు జరిగిన బదిలీల్లో ఆమె నెల్లూరు ఎస్పీగా నియమితులయ్యారు. అలాగే గ్రే హౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సునీల్ షరోన్‌ను నంద్యాల ఎస్పీగా ప్రభుత్వం నియమించింది.

రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు ముప్పు



భారత రాజ్యాంగం పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛా హక్కులను కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ హక్కులను అణచివేసే కుట్రలు చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకులైనా మీడియా సమావేశాలు నిర్వహించి అనేక అంశాల గురించి మాట్లాడతారు. వాటిని ప్రజలకు వార్తల రూపంలో చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. అంతమాత్రాన జర్నలిస్టులపై, వార్తలను ప్రచురించిన పత్రికలపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. ఈ విషయంలో సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేసి వేధించడం సరికాదు. సీఎం చంద్రబాబుకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రజలు తనను గద్దె దింపుతారనే అభద్రతా భావంతోనే ఇప్పటివరకు సోషల్ మీడియా కార్యకర్తలపై, ఇప్పుడు సాక్షి మీడియాపై కేసులు పెడుతున్నారు. చంద్రబాబు చర్యలకు కాలమే సరైన సమాధానం చెబుతుంది.

-కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే వేధిస్తారా?



ప్రాథమిక హక్కుల్లో ఒకటైన భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసేందుకు కూటమి ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో గవర్నర్, కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని సందర్భంలో, ప్రజా సమస్యలను పట్టించుకోనప్పుడు.. ప్రజా గొంతుకగా మీడియా తన వాణిని వినిపిస్తుంది. దీనిని ప్రభుత్వాలు తమ లోపాలను సరిదిద్దుకునేందుకు ఒక మంచి అవకాశంగా భావించాలే తప్ప, మీడియా, జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయకూడదు. ఒకవేళ అదే చేస్తే, ఆ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నట్లే. చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే చేస్తోంది. రైతు నుంచి యువత వరకూ అందరికీ అమలు చేయలేని హామీలు ఇచ్చి, ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న సాక్షిపై అక్రమ కేసులు పెట్టడం, సాక్షి ఎడిటర్‌ను వేధించడం సరికాదు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న చానళ్లు, పత్రికలపై వేధింపులు మానుకోవాలి.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గం

ఐక్యంగా ఉద్యమిస్తాం!

విద్యుత్ ఉద్యోగ సంఘాల అల్టిమేటం

- రేపటి నుంచి ఉద్యమ కార్యాచరణ అమలు
- 22 నాటికి దిగిరాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

సాక్షి, విశాఖపట్నం: మాయమాటలతో అన్ని వర్గాలను మభ్య పెట్టి.. అందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. విద్యుత్ ఉద్యోగుల నోట్లో కూడా మట్టి కొడుతోంది. తమ విజ్ఞప్తులు పట్టించుకోండంటూ చేసిన ఆర్తనాదాలు సర్కార్ చెవికెక్కడం లేదు. దీంతో విద్యుత్ ఉద్యోగులు 'కూటమి'గా ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు. ఈపీడీసీఎల్‌లో ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారు.. ఎప్పటికైనా శాశ్వత ఉద్యోగి కాకపోతానా అని ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు.. ఇలా ప్రతి విభాగంలోనూ ఉద్యోగులు ఉద్యమించేందుకు నడుం బిగించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామంటూ విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ముందస్తు హెచ్చరికలు చేసింది. తాము నిర్దేశించిన గడువులోగా డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు వేయకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొంది.

ఐదు ప్రధాన డిమాండ్లు సహా..

విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రభుత్వానికి తమ డిమాండ్ నోటీసుతోపాటు ఆందోళన కార్యాచరణ వివరాలను అందజేసింది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు డిమాండ్ల నోటీస్‌ను నేతలు అందజేశారు.



సీఎండీ పృథ్వీతేజ్‌కు డిమాండ్ల నోటీస్ అందజేస్తున్న జేఏసీ నేతలు(ఫైల్)

ముఖ్యంగా ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి.. ఇంతవరకూ అమలు చేయని నిర్ణయాలతోపాటు సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న వృత్తి, ఉద్యోగ పరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఐదు ప్రధాన డిమాండ్లతోపాటు.. ఇతర డిమాండ్ల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జేఏసీ డిమాండ్లలో ప్రధానమైనవి..

- 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 మధ్యలో డిస్కంలో చేరిన వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- 1999 నుంచి 2004 మధ్య విధుల్లో చేరిన రాష్ట్ర వ్యాప్తంగా 5,311 మంది ఉద్యోగుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇందులో ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో 1,573 మంది ఉండగా.. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో 347, జెన్‌కోలో 932, సీపీడీసీఎల్‌లో 835, ఎస్‌పీడీసీఎల్‌లో 1,623 మంది ఉద్యోగులు దీని కోసం ఎదురుచూస్తున్నారు.
- ప్రస్తుత ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులకు గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీని అందుబాటులోకి తేవాలి.
- ట్రాన్స్‌కో, జెన్‌కోతోపాటు డిస్కంల పరిధిలో విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబానికి కారుణ్య నియామకాలు అమలు చేయాలి
- కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి.. థర్డ్ పార్టీ ద్వారా కాకుండా నేరుగా వేతనాలు అమలు చేయాలి. 2023 ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు సమానంగా ఉండాలి.
- డిస్కంల పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, పనిని దృష్టిలో పెట్టుకొని అదనపు పోస్టులు మంజూరు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను మంజూరు చేయాలి. తద్వారా వేలాది మంది ఉద్యోగుల ఆర్థిక కష్టాలు తొలగిపోతాయని జేఏసీ స్పష్టం చేసింది.



ఉద్యమ కార్యాచరణ ఇలా..

- ఈ నెల 15, 16 తేదీల్లో బ్లాక్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నారు.
- 17, 18 తేదీల్లో అన్ని సర్కిల్స్ ప్రధాన కార్యాలయాలు, జెనరేటింగ్ స్టేషన్లలో లంచ్ సమయంలో నిరసన ప్రదర్శనలు.
- 19, 20 తేదీల్లో అన్ని సర్కిల్స్ ప్రధాన కార్యాలయాలు, జెనరేటింగ్ స్టేషన్లలో రిలే నిరాహార దీక్షలు.
- 22న శాంతి ర్యాలీలు నిర్వహిస్తూ కలెక్టర్‌కు మెమొరాండం అందించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

కేసుల పరిష్కారంలో విశాఖ నాలుగో స్థానం

మెగా లోక్ అదాలత్ విజయవంతం

విశాఖ లీగల్: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌ను విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ప్రారంభించి, రాజీమార్గమే రాజ మార్గం అని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 36 బెంచ్‌లను ప్రధాన న్యాయమూర్తి సందర్శించారు. న్యాయవాదులు, సమాంతర న్యాయ సహాయకులు, న్యాయమూర్తులు అందిస్తున్న సేవలను ఆయన పర్యవేక్షించారు. ఈ మెగా లోక్ అదాలత్ ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, అరకు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో కూడా జరిగింది. ఈ సందర్భంగా సహాయం అందించిన న్యాయవాదులు, అధికారులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు అభినందించారు. కాగా.. మోటారు ప్రమాద కేసుల్లో రెండు బెంచ్‌లు కలిపి 124 కేసులను పరిష్కరించారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న బీమా కంపెనీ ప్రతినిధులు

నష్టపరిహారం కింద రూ.4.40 లక్షలు చెల్లించారు. ది న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీకి సంబంధించిన ఒక కేసులో లబ్ధిదారునికి రూ.53 లక్షల చెక్కును ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. అలాగే సివిల్‌లో 185 కేసులు, క్రిమినల్‌లో 10,190 కేసులు, ప్రీ లిటిగేషన్‌లో 239 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. రాజీ మొత్తం విలువ దాదాపు రూ.25 కోట్లు అని, జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా జరిగిందని ఆయన వెల్లడించారు.

ఏయూలో ఉగ్రదాడి!





ఏయూలో జరిగిన రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న ఆక్టోపస్ కమాండోలు, పోలీసులు

బీచ్‌రోడ్డు: ప్రశాంతమైన ఆంధ్ర విశ్వవిద్యాలయంలోకి ఒక్కసారిగా పోలీస్ వాహనాలు దూసుకొచ్చాయి. మరోవైపు తుపాకీలతో ఆక్టోపస్ కమాండోలు సైతం చేరుకున్నారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు పరుగులు పెట్టాయి. ఈ సన్నివేశాలను చూస్తున్న ప్రజలకు అసలు ఏయూలో ఏం జరుగుతుందో అర్థం కాక ఆసక్తిగా తిలకించారు. తీరా ఇదంతా విపత్కర పరిస్థితుల్లో చేపట్టే ముందుస్తు మాక్ డ్రిల్ అని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని భారతీయ పెట్రోలియం, శక్తి సంస్థలో శనివారం నగర పోలీస్ శాఖ, ఆక్టోపస్ సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రదాడి జరిగినప్పుడు ఏ విధంగా రక్షణ చర్యలు తీసుకోవాలనే దానిపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఆక్టోపస్ డీఎస్పీ శ్రీనివాస ఆధ్వర్యంలో జరిగిన ఈ మాక్ డ్రిల్ అందరినీ అబ్బుర పరిచింది.

టీ-20 వరల్డ్ కప్‌కు గిరి పుత్రిక

- భారత అంధుల జట్టుకు ఎంపికైన పాంగి కరుణకుమారి
- ఎండాడ అంధ బాలికల పాఠశాల విద్యార్థిని



కరుణకుమారితో తల్లి దండ్రులు, బంధువు

పాడేరు రూరల్: ఓ మారుమూల గిరిజన గ్రామంలోని పేదరికం ఆమె ప్రతిభను అడ్డుకోలేకపోయింది. కంటిచూపు లోపం ఆమె ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేకపోయింది. అకుంఠిత దీక్ష, పట్టుదలతో మన్యానికి చెందిన గిరిజన యువతి పాంగి కరుణకుమారి చరిత్ర సృష్టించింది. దేశంలో తొలిసారిగా జరగనున్న అంధుల మహిళా టీ-20 ప్రపంచ కప్‌కు ఎంపికై, మట్టిలో మాణిక్యంగా నిలిచింది. పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన పాంగి రాంబాబు, సంధ్య దంపతుల కుమార్తె కరుణకుమారి. ఆమెకు ఇద్దరు చెల్లెళ్లు, అన్నయ్య ఉన్నారు. పేదరికం కారణంగా మధ్యలోనే చదువు ఆపేసిన ఆమెను ఓ ఉపాధ్యాయుడు విశాఖపట్నం జిల్లా ఎండాడలోని ప్రభుత్వ అంధుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం అక్కడ 10వ తరగతి చదువుతున్న కరుణకుమారిలోని క్రీడా నైపుణ్యాన్ని పాఠశాల పీఈటీ గుర్తించి ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన కరుణ, ఏకంగా భారత జట్టులో స్థానం సంపాదించింది.

ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో..

నవంబర్ 11 నుంచి 25 వరకు న్యూఢిల్లీ, బెంగళూరు వేదికగా ఈ ప్రతిష్టాత్మక టీ-20 ప్రపంచ కప్ టోర్నమెంట్ జరగనుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక, అమెరికా జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. లీగ్ దశలో 21 మ్యాచ్‌లు, ఆ తర్వాత నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్ కూడా పాల్గొంటున్నందున.. కొన్ని మ్యాచ్‌లను తటస్థ వేదికలైన నేపాల్ లేదా శ్రీలంకలో నిర్వహించే అవకాశం ఉంది.

ఆదుకోవాలంటున్న తల్లిదండ్రులు

తమ కుమార్తె అంతర్జాతీయ స్థాయికి ఎంపికవడంపై కరుణకుమారి తల్లిదండ్రులు రాంబాబు, సంధ్య ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని వారు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుమార్తె ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రభుత్వం, దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ కుమార్తెలాగే గిరిజన ప్రాంతాల్లో ఎందరో ప్రతిభావంతులు ఉన్నారని, వారిని గుర్తించి ప్రోత్సహిస్తే మరిన్ని అద్భుతాలు సాధిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కరుణకుమారి ఎంపిక పట్ల బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

డి-పట్టా భూముల్లో తోటల తొలగింపు

- అధికారుల పర్యవేక్షణ మధ్య కొనసాగింపు
- బాధిత రైతుల ఆందోళన

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 101/1లో కూటమి ప్రభుత్వం మే ఫెయిర్ హోటల్‌కు కేటాయించిన 40 ఎకరాల్లోని డీ పట్టా భూముల్లో తోట పంటలను తొలగించే కార్యక్రమం నాలుగు రోజులుగా అధికారుల పర్యవేక్షణ మధ్య కొనసాగుతోంది. ఈ భూమిలో భీమిలి మండలం అన్నవరం పంచాయతీ పైలపేటకు చెందిన 28 మంది డ్వాక్రా మహిళలకు పాలిశేళ్ల కిందట నాటి ప్రభుత్వం కార్పొరేట్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్‌లో భాగంగా 14 ఎకరాలు కేటాయించింది. ఇప్పుడు ఈ భూమిని కూడా మే ఫెయిర్ హోటల్ కోసం కేటాయించిన భూమిలో కలిపేశారు. ఈ భూములకు సంబంధించి భీమిలి తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులు చెల్లవని ఈ నెల 12న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ భూముల్లోని తోటలు తొలగించవద్దని కోర్టు ఆదేశించినప్పటికీ అధికారులు తమను అడ్డుకుంటున్నారని బాధిత మహిళలు అంటున్నారు.



సర్వే నంబర్ 101/1లో డీ పట్టాలు కలిగి ఫారం-3లో నమోదైన రైతుల వారసులు

రైతు కుటుంబాల ఆవేదన

మే ఫెయిర్ హోటల్‌కు కేటాయించిన 40 ఎకరాల్లోని భూమిలో భోగాపురం మండలం తూడెం పంచాయతీకి చెందిన మేకల కాపరులు, ఇతరులకు 1971 నుంచి 2000 వరకు డీపట్టాలు జారీ అయ్యాయి. ఈ పట్టాలు పొందిన వారిలో దువ్వి సూరి (డీఆర్ నంబర్ 271/79, 120/2000), దువ్వి రాములప్పడు (33/91, 123/2000), దువ్వి ఎర్రయ్య (129/2000), దువ్వి సూరమ్మ (130/2000), దంతులూరి అప్పలరాజు (492/1979) వంటి వారు ఉన్నారు. వీరికి సంబంధించిన పట్టాలను భీమిలి రెవెన్యూ అధికారులు జారీ చేసి ఫారం-3లో కూడా నమోదు చేశారు. ఈ భూమిని సాగుకు తప్ప విక్రయించరాదని రిజిస్ట్రార్ ముందు కూడా ఉంచారు. ఈ రైతులు భూమి శిస్తులు చెల్లించిన రసీదులు, జాయింట్ పట్టాలు, 10-1 అడంగల్ పత్రాలు కూడా కలిగి ఉన్నారు. ఏటా వీరు ఈ భూమిలో నీలగిరి, జీడిమామిడి, సరుగుడు తోటల నుంచి గణనీయమైన ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం మొదట 18.70 ఎకరాలు మాత్రమే హోటల్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటించి, తర్వాత 40 ఎకరాలు కేటాయించడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ ఏడాది మే నుంచి రైతులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నట్లు 1526/2025 కేసులో హైకోర్టు ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

ఒక్కొక్క అధికారి ఒక్కోలా..



మేము 70 ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ, మేకల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు అధికారులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారు. బడుగుల పొట్ట కొట్టి, బలవంతులకు కొమ్ము కాస్తున్నారు.

-దువ్వి రాములమ్మ

ల్యాండ్ పూలింగ్‌కు ఒప్పుకోలేదు



గతంలో చాలామంది రాజకీయ నాయకులు డీపట్టా భూములు విక్రయించమని అడిగినా ఇవ్వలేదు. ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌కు కోరినా అంగీకరించకుండా కోర్టుకు వెళ్లాం. ఇప్పుడు బలవంతంగా మమ్మల్ని ఈ భూములకు దూరం చేస్తున్నారు.

– దువ్వి అప్పయ్యమ్మ

అమ్ముకున్నోళ్లు బాగానే ఉన్నారు



మేము ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 70 ఏళ్లుగా ఈ భూములను సంరక్షించుకుంటున్నాం. కొందరు రైతులు ఈ భూములను దర్జాగా అమ్మేసుకున్నారు. మాకు చదువు లేదు కాబట్టి మమ్మల్ని బెదిరించి, మోసం చేసి భయపెడుతున్నారు.

– దువ్వి నరసయ్యమ్మ

నేడు బీజేపీ బహిరంగ సభ



విశాఖ విమానాశ్రయంలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

ఎంవీపీకాలనీ: రైల్వేగ్రౌండ్ వేదికగా భారతీయ జనతా పార్టీ ఆదివారం బహిరంగ సభ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. శనివారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ, పార్టీ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పదాధికారులు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని విజయవాడ వేదికగా రాష్ట్ర స్థాయి ఖాదీ సంత నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 17న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విశాఖలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌పై వామపక్షాలు, కార్మిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్నది ప్రైవేటీకరణ కాదు.. ప్రైవేట్ భాగస్వామ్యం మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న గీతా నారాయణ్

కథక్.. కూచిపూడి.. కలరిపయట్టు

- కళాభారతిలో నేత్రపర్వంగా వైశాఖి నృత్యోత్సవాలు
- శ్రీకృష్ణుడికి 'గీత' నాట్య నీరాజనం

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న 17వ వైశాఖి నృత్యోత్సవాలు రెండో రోజైన శనివారం నేత్రపర్వంగా సాగాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులు తమ అద్వితీయ ప్రదర్శనలతో ప్రేక్షకులను భక్తి, ఆధ్యాత్మిక భావనలతో ఓలలాడించారు. ముందుగా ఢిల్లీకి చెందిన ప్రఖ్యాత కథక్ నృత్యకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత షోవన నారాయణ్ 'త్రయ దర్శనం' పేరుతో చేసిన నృత్య ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. జీవాత్మ పరమాత్మలో విలీనం కావాలనే తపనతో సాగించే బహుమితీయ ప్రయాణాన్ని ఆమె తన నృత్యంతో కళ్లకు కట్టారు. ఓం: ది కాస్మిక్ డ్యాన్స్ ఆఫ్ క్రియేషన్, యశోధర త్యాగం వంటి అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు.

శ్రీకృష్ణుని లీలామృతం పంచిన గీతా నారాయణ్

అనంతరం రాష్ట్రానికి చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారిణి గీతా నారాయణ్ సుదగాని.. శ్రీకృష్ణుని జీవన శైలిని, అవతార వైభవాన్ని నృత్యరూపకంగా ఆవిష్కరించారు. శ్రీకృష్ణుని వివిధ రూపాలను, రాధామాధవుల ప్రేమను, కృష్ణుని ఉల్లాసభరితమైన స్వభావాన్ని కళ్లకు కట్టి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. అనంతరం కేరళకు చెందిన కె.వి.ముహమ్మద్ గురుక్కల్ బృందం ప్రదర్శించిన కలరిపయట్టు యుద్ధ విద్య ప్రదర్శన వీక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసింది. కత్తి యుద్ధ విన్యాసాలతో కూడిన ఈ ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

ప్రదర్శనలకు ముందు విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి సుదగాని రవిశంకర్ నారాయణ్, విశ్రాంత చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ జె.సిరికుమార్, కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎస్.రాజు, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ నృత్యాలు మన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలని, కళాకారులను ప్రోత్సహించడం గొప్ప విషయమని కొనియాడారు. నిర్వాహకుడు బత్తిన విక్రమ్ గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సవ డైరెక్టర్లు సాయి వెంకటేష్, కాశ్మీరా త్రివేది, డా.సజని వల్లభనేని, ఎం.భారతి, జగబంధు జెనా, అనుపమ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కథక్ నృత్యం చేస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత షోవన నారాయణ్ బృందం



కలరిపయట్టు యుద్ధ విద్య ప్రదర్శన

మహాకవి ఆరుద్ర సాహిత్యం అజరామరం


మాట్లాడుతున్న ప్రసిద్ధ రచయిత రవికుమార్

సీతంపేట: మహాకవి ఆరుద్ర బహుముఖ ప్రజ్ఞాశాలి అని, సాహిత్యంలో ఆయన స్పృశించని పార్శ్వం అంటూ ఏదీ లేదని పలువురు రచయితలు, సాహితీవేత్తలు కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా శనివారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఆరుద్ర శతజయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రసిద్ధ రచయిత మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కలం ప్రజల కోసం, కల కోసం కాదు అని నమ్మిన మహోన్నత వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు. 'కవిత కోసం పుట్టాను, సామాజిక క్రాంతి కోసం కలం పట్టాను' అని ఆరుద్ర అన్నారని గుర్తు చేశారు. విశాఖలో పుట్టిన ఆరుద్ర శతజయంతి సభ ఇక్కడే నిర్వహించడం సముచితమన్నారు. ఆరుద్ర తన ఇంటి పేరు, కులం పేరు వదిలిపెట్టి తనని తాను నిరూపించుకున్నారని తెలిపారు. జమీందారీ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. శ్రామిక వర్గం వైపు ఆరుద్ర నిలబడ్డారని వివరించారు.

యువతకు ఆరుద్ర గొప్పతనం తెలిసేలా..

సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని మాట్లాడుతూ ఆరుద్ర వంటి కవుల శతజయంతి సభలు నిర్వహించడం ద్వారా నేటి తరానికి ఆయన గొప్పతనం తెలుస్తుందన్నారు. రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ.. ఇటువంటి సభల ద్వారా భావితరాలకు గొప్ప కవుల రచనలు అందించి, మరికొంతమంది రచయితలను ఆ స్థాయికి తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆచార్య బాబీ వర్ధన్ మాట్లాడుతూ ఆరుద్ర కేవలం కవిగా మాత్రమే కాకుండా కథ, వ్యాసం, పరిశోధన, నాటకం, నవల, డిటెక్టివ్ నవల, సినిమా పాటలు, నృత్యం, నటన, సంగీతం వంటి అన్ని రంగాలలో నిష్ణాతుడని పేర్కొన్నారు. రచయిత చింతకింది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరుద్ర గొప్ప పరిశోధకుడని, 'సమగ్రాంధ్ర సాహిత్యం' వంటి రచనల ద్వారా భావి తరాలకు సాహిత్య సంపదను అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మేడా మస్తాన్‌రెడ్డి, గాంధీ సెంటర్ అధ్యక్షుడు వి.బాలమోహన్‌దాస్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎస్.రఘు, రచయితలు తలతోటి పృథ్వీరాజు, అయ్యగారి సీతారత్నం, అనిల్ డ్యానీ, రాంభట్ల నృసింహశర్మ, బాల సుధాకర్, మౌళి, బులుసు వెంకటేశ్వర్లు, కె.వి.ఎస్. మూర్తి, అనూరాధ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటి యజమానే దొంగ

- అద్దెకు ఉన్న వారింట్లో చేతివాటం ప్రదర్శించిన మహిళ
- 200 గ్రాముల బంగారం, 40 తులాల వెండి చోరీ
- రెండున్నరేళ్ల తర్వాత కేసును చేధించిన పెందుర్తి పోలీసులు
- మరో కేసులో మరో నిందితుడి అరెస్ట్

పెందుర్తి: తన ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి ఇంటినే గుల్ల చేసింది ఓ ప్రబుద్ధురాలు. తమ ఇంట్లో అద్దెకు ఉన్న వారు లేని సమయం చూసుకుని భారీ ఎత్తున బంగారం, వెండి దోచుకుపోయింది. రెండున్నరేళ్ల పాటు ఆ 'ఇంటి' దొంగ తప్పించుకు తిరిగింది. చివరకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు చిన్న పాటి ఆధారంతో చాకచక్యంగా వ్యవహరించి కేసును చేధించడంతో దొంగ దొరికేసింది. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ ఎన్.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. పరవాడలోని అరబిందో ఫార్మా కంపెనీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కొయ్యన రమేష్ జీవీఎంసీ 88వ వార్డు సతివానిపాలెంలో చిన్నపల్లి ధర్మారావు ఇంట్లో అద్దెకు దిగారు. ఈ క్రమంలో 2023 ఫిబ్రవరి 22న రమేష్ భార్యతో కలిసి అత్తారింటికి వెళ్లాడు. తిరిగి నాలుగు రోజుల తరువాత ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు ఓ శుభకార్యానికి వెళ్లేందుకు ఇంట్లో నగదు వేసుకునేందుకు రమేష్ భార్య సిద్ధమైంది. బీరువాలోని బంగారం కనిపించకపోవడంతో భర్తను అడిగింది. అయితే తాను బంగారం ఎక్కడో పెట్టి మరిచిపోయాననుకుని భార్యకు సర్ది చెప్పేవాడు. కొన్నాళ్ల పాటు వెతికి చివరకు రెండేళ్ల క్రితం పోలీసులను ఆశ్రయించారు. ఎంత ప్రయత్నం చేసినా ఆధారాలు లేక కేసు దాదాపు నీరు గారిపోయింది. మరోసారి బాధితులు పెందుర్తి పోలీసులను ఆశ్రయించి ఈ నెల 2న ఫిర్యాదు చేశారు. దీంతో కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న క్రైం విభాగం పోలీసులు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. చివరకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తమదైనశైలిలో అనుమానితురాలైన ఇంటి యజమాని భార్య చిన్నపల్లి సుజాత ప్రశ్నించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుందని సీఐ వెల్లడించారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువైన 200 గ్రాముల బంగారం, 40 తులాల వెండి సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు.

- పెందుర్తి భాష్యం పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న రాయుడు దుర్గాభవాని జూన్ 24న తన భర్త దుర్గాప్రసాద్ క్లర్క్‌గా పనిచేస్తున్న గోపాలపట్నంలోని కో ఆపరేటివ్ బ్యాంక్‌లో తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించారు. అనంతరం ఆటోలో పెందుర్తి వస్తుండగా బంగారం ఉంచిన బ్యాగ్ మాయమైంది. దీంతో జూలై 8న ఆమె పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం ముసిరాం గ్రామానికి చెందిన మాకిరెడ్డి గణేష్ అలియాస్ గని చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. రూ.5 లక్షల విలువైన ఆరున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయా కేసుల్లో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీ జి.నాగరాజు, పీసీలు టి.పద్మజ, టి.శివప్రసాద్, ఎల్.కె తాతారావు, బి.దేముడునాయుడు, యూ.చంద్రకళను ఉన్నతాధికారులు అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు, చిత్రంలో ఎస్ఐ సూరిబాబు

సాగరతీరంలో 'విష్ణు విన్యాసాలు'


లొకేషన్‌లో నటుడు శ్రీవిష్ణు

కొమ్మాది: బీచ్‌రోడ్డులోని సాగర్‌నగర్ వద్ద సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించి షూటింగ్ జరిగింది. వర్షం పడుతున్న నేపథ్యంలో హీరో, హీరోయిన్లు కలిసే సందర్భానికి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. తెల్లవారుజామున వ్యాయామం కోసం వచ్చిన వారు సినిమా షూటింగ్‌ను చూసి నటీనటులతో సెల్ఫీలు దిగారు. కాగా.. ఈ సినిమాకు 'విష్ణు విన్యాసాలు' అనే పేరు ప్రచారంలో ఉంది.

జనారణ్యంలోకి కొండ మేక

- కుక్కల దాడిలో గాయాలు
- జూ పార్కుకు తరలించిన వైద్యులు


పీఎం పాలెంలోని ఓ నివాసంలో కొండ మేక

మధురవాడ: కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి శనివారం సాయంత్రం పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద గల జన సమూహంలోకి ఒక కొండ గొర్రె వచ్చింది. కుక్కలు తరిమి దాడి చేయడంతో ఓ నివాసంలోకి వచ్చి చేరింది. స్థానికులు దానికి రక్షణ కల్పించి అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.వి.శాస్త్రి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జంతువు అరుదైన కొండ మేకని అన్నారు. కొండ మేక, కొండ గొర్రెలు అరుదుగా ఉన్నాయన్నారు. ఇది చూలుతో ఉందని, కుక్కలు మూతి మీద గాయాలు చేశాయని తెలిపారు. వైద్యంతోపాటు రక్షణ కూడా అవసరమని చెప్పారు. రేంజ్ ఆఫీసర్ సమాచారంతో జూ వైద్యుడు శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ప్రాథమిక వైద్య అందించి కేవ్‌లో కొండ మేకని విశాఖ జూ పార్కుకు తరలించారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు


వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఎంవీపీకాలనీ: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సామూహికంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు తెలిపారు. జిల్లాలోని ఆయా వసతి గృహాల్లో జరిగిన వైద్య శిబిరాల వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో ఆదేశాలతో స్థానిక యూపీహెచ్‌వోల వైద్య అధికారులు, సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. 3వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు సుమారు 5,500 మంది విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా ఈ సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. వైద్య సేవలతోపాటు విద్యార్థులకు ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు.

ప్రైవేట్ బీచ్ శాండ్ మైనింగ్‌తో దేశ భద్రతకు ముప్పు

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ

విశాఖ సిటీ: కార్పొరేట్ కంపెనీకి తీర ప్రాంతంలో బీచ్ సాండ్ మైనింగ్‌కు అనుమతివ్వడం దేశ భద్రతకు ముప్పు అని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మెయిల్ పంపారు. ఇందుకోసం పబ్లిక్ హియరింగ్ నిబంధనను సడలించడం దారుణమని పేర్కొన్నారు. మైనింగ్ కార్యకలాపాలకు అంతరాయం లేకుండా ఉండటానికే ప్రభుత్వాలు పర్యావరణ నిబంధనలను సడలించినట్లు తెలుస్తోందన్నారు. దీనిపై ఇప్పటికే ఈ నెల 11న రాష్ట్రపతికి లేఖ రాసినట్లు తెలిపారు. ఈ విషయాలను స్వయంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ సీఎంను కోరారు.

ఉత్తమ ప్రైవేట్ టీచర్లకు అపుస్మా అవార్డులు



అవార్డులు పొందిన ప్రైవేట్ ఉపాధ్యాయులతో అపుస్మా నాయకులు

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డుల పురస్కార కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఏయూలోని బి.ఆర్.అంబేడ్కర్ హాల్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న 179 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా వారికి అవార్డులు అందజేశారు. వీరితో పాటు సుమారు 20 ఏళ్లుగా పాఠశాలలను నిర్వహిస్తున్న మరో 12 మందిని కూడా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తి అని తెలిపారు. అపుస్మా చీఫ్ మెంటర్ ఎ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేని కోరారు. రీజనల్ అధ్యక్షుడు ఎం.వి.రావు, జిల్లా అధ్యక్షుడు ఎం.వి.వి.సత్యనారాయణ, యు.సురేశ్ కుమార్, శేషు, శ్రీనివాసరావు, ఎం.రాము నాయుడు, మహమ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల ప్రారంభం


తైక్వాండో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పీఎంపాలెం: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శిల్పారామంలోని యోగా హాలులో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. ప్రాచీన యుద్ధకళలు వ్యక్తిగత ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాలకు చెందిన సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఆనంద్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్ర అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ బాబూరావు, పీఎంపాలెం వాకర్స్ క్లబ్ 20-20 అసోసియేషన్ అధ్యక్షుడు బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్విగ్గీ, జొమాటో రైడర్ల నిరసన

ఉద్యోగ భద్రత, ఆదాయం పెంచాలని డిమాండ్



ధర్నా చేస్తున్న గిగ్‌వర్కర్స్

సీతంపేట: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్విగ్గీ, జొమాటో రైడర్లు నగరంలోని డైమండ్ పార్కు, మధురవాడ, గాజువాక, ఎన్ఏడీ, పెందుర్తి ప్రాంతాల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 40 వేల మంది యువత స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫాంలలో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను తిరిగి పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే కనీస హామీ ఆదాయం చెల్లించాలని, సంవత్సరం పొడవునా ఒకే రకమైన రేటు కొనసాగించాలని, ఇన్సెంటివ్, ఒక కిలోమీటరుకు ఎంత రేటు ఇస్తారో యాప్‌లో స్పష్టంగా చూపించాలని, బేస్ పేను రూ. 30కి పెంచాలని, గతంలో ఇచ్చిన విధంగా పీక్ అవర్స్‌లో రూ. 12, నాన్-పీక్ అవర్స్‌లో రూ. 10 ఇన్సెంటివ్ ఇవ్వాలని, ఇన్సెంటివ్ కోసం రెండు పిక్స్ తప్పనిసరి చేయకూడదని డిమాండ్ చేశారు. ఏడేళ్ల కిందట లీటరు పెట్రోల్ ధర రూ.76 ఉన్నప్పుడు ఆదాయం బాగా వచ్చేదని, ఇప్పుడు లీటరు రూ. 108కి పెరిగిందని, కానీ ఆదాయం మాత్రం పెరగలేదని జగన్ వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, లాగిన్ గంటలు, ఆర్డర్లు పెరిగినా ఆదాయం మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైడర్లకు ఏదైనా సమస్య వస్తే దానిని పరిష్కరించడానికి సంస్థ తరపున ఒక ప్రతినిధి అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

వెలగపూడి లిక్కర్ దందా

కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ప్రియాంక ఆరోపణ

విశాఖ సిటీ: విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కల్లు గీత సామాజిక వర్గానికి చెందిన వారి పేర్ల మీద బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్ తీసుకొని తన బినామీలతో లిక్కర్ దందా నడుపుతున్నారని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ప్రియాంక దండి ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విశాఖ జిల్లాలో కల్లుగీత కార్మికులకు 10 బార్ అండ్ రెస్టారెంట్లు కేటాయిస్తే.. వాటిలో నాలుగింటిని ఎమ్మెల్యే వెలగపూడి చేజిక్కించుకున్నారని పేర్కొన్నారు. గీత కార్మికులకు నామమాత్రంగా ఇచ్చి వారి పేర్ల మీద వచ్చిన లైసెన్స్‌తో తన బినామీలను పెట్టి వ్యాపారాన్ని చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పలు చోట్ల మద్యం బెల్ట్ షాపులు కూడా నడిపిస్తున్నారని, తోటగరువు హైస్కూల్ పక్కన ఉన్న ఒక చిన్న బడ్డీని బెల్ట్‌షాపుగా తయారు చేసి మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు. ఆ బడ్డీ యజమాని జీవీఎంసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారన్నారు. జిల్లాలో అన్ని మద్యం షాపులు వెలగపూడి కంట్రోల్‌లోనే నడుస్తున్నాయన్న ఆరోణలు ఉన్నట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు వెంటనే విచారణ జరిపి బినామీలను శిక్షించి కల్లు గీత కార్మికులకు ఆ బార్ అండ్ రెస్టారెంట్స్ అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెలగపూడి లిక్కర్ మాఫియా మీద పోరాటాలు చెపడతామని హెచ్చరించారు.

గెస్ట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్: నగరంలోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు గెస్ట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్యూటీషియన్ కోర్సుల్లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 27 ఏళ్లలోపు వయసు గల యువతీ యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజన వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ జారీ చేసి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7337076665, 7993011605 నంబర్లలో సంప్రదించవచ్చు.

స్పా ముసుగులో వ్యభిచారం

నిర్వాహకురాలు, విటుడు, బాధితుల అరెస్టు



గాజువాక: గాజువాకలోని ఒక స్పా సెంటర్‌పై గాజువాక పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం దాడి చేశారు. అందులో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న వ్యభిచారాన్ని రట్టు చేశారు. పాతగాజువాకలోని సీఎంఆర్ సెంట్రల్‌కు సమీపంలోని ఎస్ఎస్ థాయ్ స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గాజువాక పోలీసులతో కలిసి దాడి చేశారు. అక్కడ వ్యభిచారం జరుగుతుండటంతో స్పా సెంటర్ నిర్వాహకురాలు సహా ఒక విటుడిని అరెస్టు, ఐదుగురు బాధితులను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు గాజువాక సీఐ పార్థసారధి తెలిపారు. జోన్-2 టాస్క్‌ఫోర్స్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో ఎస్ఐ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.132
బ్రాయిలర్ (లైవ్)	: రూ.152
స్కిన్	: రూ.274
స్కిన్‌లెస్	: రూ.284

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)	
విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	559.00